క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



బాలసదన్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లో ఉన్న బాలసదన్ హాస్టల్‌లో విద్యార్థులకు గురువారం సాయినగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ శ్వేత మాట్లాడుతూ విద్యార్థులందరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, తరచూ హ్యాండ్‌వాష్ చేసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో జిల్లా త్వరిత చికిత్స కేంద్రం వైద్యులు ప్రేమ్‌కుమార్, కళ్యాణి, లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్, ఎంఎల్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, హెల్త్ అసిస్టెంట్ అనిత, మోహన్‌రెడ్డి, ఆశా వర్కర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



శంకరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లచెరువు: కె.పూలకుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఆంజనేయులు (అంజి వాల్మీకి) తల్లి శంకరమ్మ(70) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆంజనేయులును ఫోన్‌లో పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి(ఆర్గనైజేషన్ యాక్టివిటీ) వజ్ర భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా గ్రామానికి చేరుకుని శంకరమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్ రెడ్డి, దశరథ నాయుడు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి,సర్పంచ్ యూసుఫ్, శ్రీధర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, సమీవుల్లా, అక్బర్,నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



బాబాఫక్రోద్దీన్

కదిరి అర్బన్: పట్టణంలోని మారుతీ నగర్‌కు చెందిన బాబా ఫక్రోద్దీన్ అదృశ్యమయ్యాడు. గత నెల 30న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం బాధితుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా అప్పులు ఎక్కువగా చేసి వాటిని తిరిగి చెల్లించలేక ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు బాధితుడి భార్య ఫిర్యాదులో పేర్కొంది.

6న ఉచిత వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: స్థానిక సాంస్కృతిక మండలిలో ఈనెల 6న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో గండికోట ఆస్పత్రి వైద్యుల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. రోటరీక్లబ్ సభ్యులు రమేష్‌బాబు, సోలిగాళ్ల వెంకటేషులు, సత్రసాల ప్రసన్నకుమార్, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శిబిరంలో షుగర్, థైరాయిడ్ పరీక్షలు చేస్తారన్నారు. పేద ప్రజలు వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మైనార్టీల సంక్షేమంపై సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్: స్థానిక మదరసా ఏ దారుల్‌ఉలూం పుర్ఖానియాలో గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముస్లిం మతపెద్దలతో మైనార్టీ సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో షాదీఖానాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. అలాగే మసీదుల్లో నిరుపేద ఇమాం, మౌజన్లకు ఇంటి స్థలాలు ఇస్తామన్నారు. మున్సిపల్ కమీషనర్ కిరణ్‌కుమార్, తహశీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకయాతన

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ధర్మవరం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కిందపడటంతో గాయపడుతున్నారు. పల్లె రోడ్ల రూపురేఖలు మారుస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేకపోయిందని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



గుంతలమయమైన నార్శింపల్లి-బత్తలపల్లి రహదారి

తాడిమర్రి: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. గుంతలు పడిన రహదారులతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ధర్మవరం నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తాడిమర్రి మండలంలో తాడిమర్రి-పిన్నదరి, పిన్నదరి-పుల్లానారాయణపల్లి, ఆత్మకూరు-తాడిమర్రి, పత్రపల్లి-తాడిమర్రి, తాడిమర్రి-మర్రిమాకులపల్లి, మోదుగులకుంట-బంగారంపేట, పెద్దకోట్ల గుడ్డంపల్లి, కునుకుంట్ల-తాడిమర్రి, కునుకుంట్ల-చిల్లకొండయ్యపల్లి, నిడిగల్లు నుంచి నార్శింపల్లి, బత్తలపల్లి గ్రామాల మధ్య రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అలాగే బత్తలపల్లి మండలంలో కట్టకిందపల్లి-తిమ్మన్నకొట్టాల, మాల్యవంతం-చీమలనాగేపల్లి, చెర్లోపల్లి, కదిరి-అనంతపురం బైపాస్ రోడ్డు నుంచి అనంత సాగరం, మాల్యవంతం వరకూ రోడ్లు గుంతలు పడ్డాయి. ధర్మవరం మండలంలో ధర్మవరం-నడిమిగడ్డపల్లి మీదుగా మాలగుండ్లపల్లి, ధర్మవరం-వెంకటతిమ్మాపురం, రావులచెర్వు-విశ్వనాథపురం, ధర్మవరం-సుబ్బరాయునిపేట తదితర గ్రామాల్లో రహదారులు పాడయ్యాయి. అలాగే ముదిగుబ్బ మండలంలో రాళ్ల అనంతపురం-పెద్దచిగుళ్లరేవు, ముదిగుబ్బ-చిన్నకోట్ల, ముదిగుబ్బ-మారాల, ముదిగుబ్బ అడవిబాపనపల్లి, మల్లికామల క్రాస్-తిమ్మనాయుని పాళ్యం తదితర గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కాలంలో నియోజక వర్గంలో కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు చేరి రహదారుల్లో గోతులు ఏర్పడ్డాయి. నాలుగు చక్రాల వాహనాలే కాకుండా ద్విచక్ర వాహనదారులు కూడా ఈ రహదారుల్లో ప్రయాణం చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. గర్భిణులు వైద్య చికిత్సల కోసం లేదా ప్రసవం కోసం మండల కేంద్రాలకు లేదా ఇతర పట్టణాలకు వెళ్లాలంటే తల్లడిల్లిపోతున్నారు. గుంతలకు తోడు పలు గ్రామాల్లో ఇరువైపులా కంపచెట్లు పెరిగి రహదారులు కనిపించకుండా మూసుకు పోయాయి. అధికారులు స్పందించి రహదారులు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నారు



గుంతలు పడిన రహదారుల్లో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక వృద్ధులు, గర్భిణులు ఈ రహదారుల్లో ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. మాలగుండ్లపల్లి నుంచి నడిమిగడ్డపల్లి మీదుగా లేదా వెంకటతిమ్మాపురం మీదుగా ధర్మవరం వెళ్లడానికి రహదారులు ఉన్నాయి. అయితే రెండు రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

–కొమేరి శ్రీనివాసులు, ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, మాలగుండ్లపల్లి, ధర్మవరం

రోడ్లన్నీ గుంతుల పడ్డాయి



గుంతలు పడిన రహదారులతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. గ్రామం నుంచి మండల కేంద్రం తాడిమర్రికి వెళ్లాలన్నా, బత్తలపల్లి, ధర్మవరం, అనంతపురం వెళ్లాలన్నా ఇటు ఆరు కిలోమీటర్లు, అటు నాలుగు కిలోమీటర్లు రహదారి గుండా గుంతలు ఏర్పడ్డాయి. పది నిమిషాల ప్రయాణానికి గంటల వ్యవధి సమయం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలి.

–సాకే సదానంద, సర్పంచ్, పిన్నదరి, తాడిమర్రి

బెల్ట్ షాపులు మూయించాలి

ఓడీచెరువు: ఓడీ చెరువు మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను వెంటనే మూయించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా, ఏపీ రైతు సంఘం నాయకులు రామచంద్ర తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఓడీచెరువు మండల కేంద్రంలో 10, మండల వ్యాప్తంగా 104 పల్లెల్లో ప్రతి పల్లెలో మూడు, నాలుగు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్నారు. వీటన్నింటినీ వెంటనే తొలగించాలన్నారు.

'విద్యాశక్తి'ని రద్దు చేయాలి

కదిరి అర్బన్: విద్యాశక్తి పేరిట రాష్ట్ర విద్యాశాఖ రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యార్థులకు శిక్షణ పేరిట ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేసే విద్యాశక్తి కార్యక్రమాన్ని రద్దు చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్‌లాజమ్, మారుతీ ప్రసాద్ కోరారు. ఈమేరకు గురువారం వారు ఓ ప్రకటనలో విడుదల చేశారు. ఇలాంటి నిర్ణయాలు విద్యాశాఖ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



గాయపడిన ఈశ్వర్

పులివెందుల రూరల్ : పులివెందుల మండలం కనంపల్లె – ఓదులపల్లి తండా గ్రామాల మధ్యలో గురువారం మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం ఉడుములకుర్తి నుంచి బైక్‌పై గంగరాజు తన కుమారులు ఈశ్వర్, దేవేంద్ర, భార్యతో కలిసి పులివెందులలోని సర్వజన ఆసుపత్రికి బయలుదేరాడు. కనంపల్లె సమీపంలోని ఓదులపల్లె తండా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వర్, దేవేంద్రతో పాటు గంగరాజు, అతని భార్యకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో పులివెందుల సర్వజన ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

నల్లచెరువు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు తనకల్లు మండలం మబ్బువారిపల్లికి చెందిన వేణుగోపాల్, వరలక్ష్మి దంపతులు గురువారం వ్యక్తిగత పనులపై కదిరికి బైక్‌పై బయలు దేరారు. అయితే నల్లచెరువు సమీపంలోకి రాగానే బైక్ జాతీయ రహదారి పక్కనే ఉన్న మోరీ గుంతలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో వరలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. వేణుగోపాల్ క్షేమంగా బయటపడ్డాడు. స్థానికులు ఆమెను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యక్తి మృతి

ముదిగుబ్బ: మండలంలోని నాగలగుబ్బకు చెందిన సుద్దల క్రిష్టప్ప (54) అనే వ్యక్తి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. వ్యవసాయ పనుల నిమిత్తం బుధవారం సాయంత్రం పొలం వద్దకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడికి భార్య అనుసూయమ్మ, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి



ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్‌కు డిమాండ్ నోటీసు అందజేస్తున్న కమిషనర్

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ సూచించారు. గురువారం పుట్టపర్తి పట్టణంలో పన్నులు అధికంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్ బిల్డింగ్‌లు, అపార్టు మెంట్ యజమానులను కలసి డిమాండ్ నోటీసులు అందజేశారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో ఆస్తి, నీటి పన్నులు బకాయిలు దాదాపు రూ. 10 కోట్ల వరకూ పేరుకుపోయాయన్నారు.

రక్త గ్రూపు నిర్ధారణ శిబిరానికి స్పందన



పుస్తకాలను విడుదల చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గుద్దిటి సోమదాసు వైట్ హౌస్‌లో గురువారం నిర్వహించిన మెగా ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ శిబిరానికి మంచి స్పందన వచ్చింది. చేనేత ప్రముఖులు గుద్దిటి సోమదాసు, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, వ్యక్తిత్వ మానసిక వికాస నిపుణులు లీలా మనోహర్, లెక్చరర్ కుమారి, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు పోలా ప్రభాకర్, బీఎస్‌ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మేరీవరకుమారి, సామాజిక ఆరోగ్య విభాగం నిపుణులు సత్యనిర్ధారణ్ రక్త గ్రూపు నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. శిబిరంలో 50 మంది రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎంఎల్‌టీ విద్యార్థులు, ప్రజలకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. శుక్రవారం నుంచి కళాశాలలకు వెళ్లి రక్త పరీక్షలు చేయనున్నారు. అనంతరం క్రితిక గెలిచిన్ అనే పుస్తకాలను విడుదల చేశారు కార్యక్రమంలో మెహర్ బాబా ఆశ్రమం నిర్వాహకులు సుజాత, కళాశాల అధ్యాపకులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సానే రవీంద్రరెడ్డి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఆంజనేయస్వామి మూలవిరాట్



రహదారిలో ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశం

కనగానపల్లి: కుర్లపల్లి గ్రామ సమీపంలో వారదయ్య కొండపై నిర్వహించే ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎత్తయిన కొండపై వెలసిన వారదయ్యస్వామి (ఆంజనేయస్వామి)కి ప్రతి ఊటా ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. వచ్చే శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచే గాక కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా భక్తులు నిర్వహించే ప్రత్యేక పూజలు, దాసంగం (అన్నదానం)కు అవసరమైన ఏర్పాట్లన్నీ చేస్తున్నారు.

దాతల సహకారంతో రహదారి పనులు

కుర్లపల్లి సమీపంలో ఉన్న వారదయ్య కొండకు వెళ్లాలంటే భక్తులు కనగానపల్లి మారెమ్మగుడి, కుర్లపల్లి మీదుగా సుమారు 7 కి.మీ పాటు మట్టి రోడ్డు గుండా వెళ్లాల్సి ఉంది. అయితే రహదారి పక్కన ముళ్ల కంపలతో ఇబ్బందిగా మారింది. దీంతో దాతలు నెట్టం అమరనాథ్, చంద్రశేఖర్ సుమారు రూ.లక్ష వరకు వెచ్చించి రహదారి పక్కన ఉన్న ముళ్ల పొదలను తొలగిస్తున్నారు. దీంతో పాటు జేసీబీ ద్వారా రహదారిపై పడిన గుంతలను పూడ్చి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు రాకుండా చేస్తున్నారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు

ధర్మవరం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షల్లో ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, కార్యదర్శి జయకృష్ణ, బాబు, అనిల్ ఆధ్వర్యంలో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో వాటర్ వర్క్స్, పార్క్ స్ట్రీట్ లైట్, కంప్యూటర్ ఆపరేటర్స్ వర్కర్స్ తదితర విభాగంలో పనిచేస్తున్న వారికి తల్లికి వందనం పథకం, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, జీఓ 36 ప్రకారం రూ.24,500 వేతనం అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా జూలై 4 నుంచి అత్యవసర సేవలు బంద్ చేసి పూర్తిస్థాయి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు కాటమయ్య, చింతా కేశవ, దస్తగిరి, చంద్రశేఖర్‌రెడ్డి, యోగేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ల విడుదల



ధర్మవరంలో పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు



ఓడీచెరువులో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ధర్మవరం: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు జె.వి.రమణ, ఎస్.హెచ్.బాషా, ఆయుబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు చంద్రకళ కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద గురువారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా సీఐటీయూ ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తామన్నారు. కార్మికులకు సంబంధించిన 29 చట్టాలను కుదిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. రాజ్యాంగపరంగా ఉన్న 29 చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హైదర్‌వలి, ఇర్ఫానా తదితరులు పాల్గొన్నారు.

9న సమ్మె జయప్రదం చేయండి

ఓడీచెరువు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పేర్కొన్నారు. ఓడీచెరువు మండల కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో కర పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రాము, రమణ, గంగరాజు, ఖాసీం, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలపై పోరాటాలకు సిద్ధం



మాట్లాడుతున్న గంగుల సుధీర్‌రెడ్డి

రాప్తాడురూరల్: సీఎం చంద్రబాబు మోసాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అనంతపురం నగర శివారులోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువజన విభాగం నేతలతో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారన్నారు. త్వరలోనే రాప్తాడు నియోజకవర్గంలో 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్లు గోవిందరెడ్డి, లింగారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి నీరుగంటి నారాయణరెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బద్దలాపురం పెద్దిరెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, వలంటీర్ల విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు ముష్టికోవెల హరినాథరెడ్డి, యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రిలో కొలువుదీరిన పీర్లు







తాడిమర్రిలో కొలువైన పీర్లు, నూతనకాల్వలో ప్రజలకు సూచనలిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి, పోతులనాగేపల్లిలో అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు

తాడిమర్రి: మండల కేంద్రంలో మొహర్రం ఉత్సవాలను పురస్కరించుకుని పీర్లు కొలువుదీరాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పీర్ల పెట్టెకు పూలమాలలు వేసి, డప్పులు, మేళాల వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. గురువారం కుళ్లాయస్వామి, ఉస్సేనప్ప, పెద్ద కాశీం, చిన్న కాశీం పీర్లకు వెండి ఆభరణాలు తొడిగి, నూతన వస్త్రాలు కట్టి, పలు రకాల పూలమాలలతో పీర్లను అందంగా అలంకరించి పీర్ల చావిడిలో నిలిపారు. శుక్రవారం చిన్న సరిగెత్తు, శనివారం పెద్ద సరిగెత్తు తర్వాత ఆదివారం పీర్లు జలధికి వెళతాయని ముజావర్ ముత్తుజా తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లప్పగారి మహేశ్వర్‌రెడ్డి, మల్లప్పగారి మల్లికార్జున రెడ్డి, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

తలుపుల : మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ శివనారాయణస్వామి ప్రజలకు సూచించారు. గురువారం ఆయన రూరల్ సీఐ నాగేంద్ర, ఏఎస్‌ఐ గుర్రప్పతో కలిసి తలుపులలోనికుమ్మరపేట, కోట, ఎగువపేట, పూలబజార్, నూతనకాల్వలో పర్యటించారు. ఈసందర్భంగా డీఎస్పీ ఆయా గ్రామాల పెద్దలతో మొహర్రం నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. గ్రామాల్లో పోలీసుల నిఘా ఉంటుందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధర్మవరం రూరల్: గ్రామాల్లో మొహరం వేడుకలను ప్రజలకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి పోతులనాగేపల్లిలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుత్తూ ఎటువంటి గొడవలకు వెళ్లకుండా మొహర్రం చేసుకోవాలన్నారు. అలాగే పేకాట, జూదం, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అనతరం సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.